

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.87,520
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,930
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.98,800
రిటైల్ వెండి గ్రాము	రూ.101.80

క్లుప్తంగా

వెటర్నరీ జూడాల వినూత్న నిరసన



ఎమ్మెల్యేకి వినతిపత్రం సమర్పిస్తున్న వెటర్నరీ విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాల సమ్మె ఐదో రోజుకు చేరింది. ఇందులో భాగంగా శుక్రవారం విద్యార్థులు వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. వర్సిటీ ఆవరణలోని గ్రౌండ్‌లో 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ నల్ల దుస్తులు, వైట్ యాప్రాన్లను ధరించి వెటర్నరీ వైద్య లోగో ఆకారంలో కూర్చొని తమ నిరసనను తెలియజేశారు. గౌరవేతనాన్ని వెంటనే పెంచాలని, అన్ని వైద్య విభాగాల్లో ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు అందజేస్తున్న స్టైఫండ్‌తో సమానంగా తమకు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నానిని కలసి వినతిపత్రం సమర్పించారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

కారు ఢీకొని కూలీ మృతి



మృతి చెందిన వెంకటరత్నం

పెళ్లకూరు: కారు ఢీకొని వ్యవసాయ కూలీ మృతిచెందిన ఘటన నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి టెంకాయతోపు గ్రామం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. రావులపాడు దళిత వాడకు చెందిన వెంకటరత్నం(58) వ్యవసాయ పనుల నిమిత్తం టెంకాయతోపు వద్ద రోడ్డు దాటుతుండగా అదే సమయంలో బెంగళూరు నుంచి నెల్లూరుకు వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరత్నం అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చూస్తే తెల్లబోవాల్సిందే!

అగ్రిగోల్డ్ భూముల్లో ఇష్టారాజ్యం

- విచ్చలవిడిగా తెల్లరాయి తవ్వకాలు
- జామాయిల్ చెట్ల నరికి వేత
- సహజ సంపదపై కన్నేసిన కూటమి నేతలు
- సీఐడీ అధీనంలో భూముల్లోకి ప్రవేశించి దోపిడీ



అగ్రి గోల్డ్ భూముల్లో తవ్వకాలు చేసి వదిలేసిన తెల్లరాయి గుట్టలు

చిల్లకూరు: కూటమి నేతలు అధికార మదంతో చెలరేగిపోతున్నారు. అధికారులను మచ్చిక చేసుకుని సహజ సంపదను కొల్లగొడుతున్నారు. ఇలాంటిదే చిల్లకూరు మండలంలో చోటు చేసుకుంది. అగ్రి గోల్డ్‌కు చెందిన భూముల్లో తెల్ల రాయి తవ్వకాలతోపాటు జామాయిల్ తోటలను నరికేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటు సీఐడీ, ఇటు రెవెన్యూ శాఖలు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కలప లారీ

అసలేం జరుగుతోందంటే!

చిల్లకూరు మండలం, ఎగువరాజుపాళెం ప్రాంతంలో గత టీడీపీ హయాంలో అగ్రిగోల్డ్ యాజమాన్యం సుమారు 470 ఎకరాల భూములను కొనుగోలు చేసింది. అక్కడే రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించింది. అందులో సుమారు వంద ఎకరాల్లో ప్లాట్లు వేసి వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంది. అనంతరం అగ్రిగోల్డ్ సంస్థలో జరిగిన పలు కుంభకోణాల వల్ల ఎక్కడ భూముల అక్కడే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇందులో భాగంగా చిల్లకూరు మండలంలో ఉన్న అన్ని రియల్ ఎస్టేట్లతో పాటు ఎగువరాజుపాళెంలోని 470 ఎకరాలు సీఐడీ పర్యవేక్షణలోకి వెళ్లిపోయాయి. దీంతో ఆ భూముల వైపు ఎవ్వరూ కన్నెత్తి చూడడం లేదు. ఇదే అదనుగా భావించిన కూటమి నేతలు ఆ భూముల్లోని సహజ సంపదను దోచుకునేందుకు పోటీ పడుతున్నారు.

విచ్చలవిడిగా జామాయిల్ తోటల నరికివేత


టీడీపీ కేంద్ర కార్యాలయంలో పలుకుబడి ఉన్న కొంతమంది మరొక అడుగు ముందుకేసి అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ చెట్లను నరికి సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ కలప విలువ కూడా సుమారు రూ.20 లక్షల వరకు ఉండవచ్చని అంటున్నారు. కలపను నరికిన వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేయకుండా రెవెన్యూ అధికారుల ద్వారా కేసు పెట్టేందుకు ప్రయత్నించగా వారు కూడా సదరు వ్యక్తులు తమకు తెలియదని చేతులెత్తేశారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు నరికినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు మూడు లారీల కలపను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు లారీలను స్వాధీనం చేసుకుని మూడు రోజులవుతున్నా కేసులు నమోదు చేయడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ విషయంపై సీఐడీకి చెందిన సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

అక్రమంగా క్వార్ట్జ్ తవ్వకాలు

ఇటీవల ఓజిలి మండలం, భువనగిరిపాళెం వైపున ఉన్న భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి క్వార్ట్జ్ తవ్వకాలు చేపట్టారు. గత ఏడాది కూడా అగ్రిగోల్డ్ భూముల్లోని తెల్లరాయిని తవ్వేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు గుర్తించి ఆ ప్రాంతంలో ట్రెంచ్ ఏర్పాటు చేశారు. ఆ తరువాత స్తబ్దుగా ఉన్న కూటమి నేతలు అధికారంలోకి రావడంతోనే చెలరేగిపోతున్నారు. అయితే గ్రామస్తులు అడ్డుకోవడంతో తవ్వకాలను నిలిపి వేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామస్తులు అడ్డుకోకుండా ఉంటే సుమారు రూ.50 లక్షల విలువచేసే ఖనిజ సంపద బయటకు వెళ్లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

భోజనంలో జెర్రి

- ఎస్వీయూలో ఘోరం
- ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు



విద్యార్థి ప్లేట్‌లో జెర్రి

తిరుపతి సిటీ: ఎస్వీయూ మరోమారు వార్తల్లోకి ఎక్కింది. శుక్రవారం రాత్రి విద్యార్థులకు వడ్డించిన భోజనంలో జెర్రి ప్రత్యక్షమైంది. దీంతో సుమారు వంద మంది విద్యార్థులు భోజనాలు తినకుండా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్స్ అధికారులకు సమాచారాన్ని అందించినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఎస్వీయూలోని ఏ, బీ, సీ బ్లాక్‌లలోని విద్యార్థులకు ఏ మెస్‌లో భోజనవసతి కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఓ విద్యార్థికి వడ్డించిన భోజనంలో జెర్రి కనిపించడంతో విస్తుపోయారు. అక్కడే భోజనానికి విచ్చేసిన సుమారు వంద మంది విద్యార్థులు ప్లేట్లల్లో వడ్డించిన భోజనాన్ని వదిలేశారు. వెంటనే మెస్ ఇన్‌చార్జ్‌లకు, వార్డెన్‌కు సమాచారం అందించారు. రేపు మాట్లాడుదాం..? అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి ఫోన్ కట్ చేశారని విద్యార్థులు వాపోతున్నారు.

విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటారా?

అధికారులకు సమాచారం అందించినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. సుమారు వంద మంది విద్యార్థులు భోజనం చేయకుండా ఆకలితో అలమటిస్తున్నా ప్రత్యామ్నాయం చూపకపోవడం దారుణం. వర్సిటీలో పాలన అటకెక్కింది.

చింటూకు బెయిల్!

- చిత్తూరు మాజీ మేయర్ దంపతుల కేసులో ఊరట
- తొమ్మిదేళ్లకు పైగా జైల్లో అండర్ ట్రయల్ ఖైదీగా చింటూ
- షరతులతో బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు



చింటూ (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు మాజీ మేయర్ కటారి అనురాధ, ఆమె భర్త జంట హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న చింటూ అలియాస్ శ్రీరామ్ చంద్రశేఖర్‌కు బెయిల్ మంజూరైంది. జంట హత్యల తరువాత తొమ్మిదేళ్లకు పైగా జైల్లో ఉన్న చింటూకు రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయనకు భారీ ఊరట లభించినట్లయ్యింది.

కేసు వివరాలివీ..

చిత్తూరు మాజీ మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ 2015, నవంబరు 17వ తేదీన చిత్తూరు నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉన్నారు. ముసుగులు (బుర్కా) ధరించి వచ్చిన ఓ వ్యక్తితో పాటు మరికొందరు తుపాకులు, కత్తులతో ఛాంబర్‌లోకి చొరబడ్డారు. మేయర్ అనురాధను తుపాకీతో కాల్చి చంపగా.. ఆమె భర్త మోహన్‌ను కార్యాలయంలో వేటాడి కత్తులతో నరికి హత మార్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా పోలీసుశాఖ వైఫల్యానికి అద్దం పట్టే ఈ ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేరంలో మోహన్ మేనల్లుడు చింటూ అలియాస్ చంద్రశేఖర్ ప్రధాన నిందితుడిగా హత్యలో పాల్గొని, కుట్రతో పాలు పంచుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. 2015 నవంబరు 30వ తేదీ చింటూ చిత్తూరు కోర్టులో లొంగిపోయాడు. మొత్తం 23 మందిని పోలీసులు నిందితులుగా చూపారు. వీరిలో ఒకరికి ఈ హత్య కేసులో సంబంధం లేదని న్యాయస్థానం తీర్పునిచ్చింది. అప్పటి నుంచి ఈ కేసు విచారణ కొనసాగుతోంది. కాగా 2007 డిసెంబరు 31న చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబుపై జరిగిన హత్యాయత్నం కేసులో చింటూకు చిత్తూరులోని జిల్లా కోర్టు 2018 మార్చిలో జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. దీనిపై నిందితుడు కోర్టును ఆశ్రయించడంతో గతేడాది ఈ కేసును కొట్టేస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది.

షరతులతో బెయిల్..

తాను ఇప్పటివరకు ఆరుసార్లు బెయిల్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు, దాదాపు తొమ్మిదేళ్లకు పైగా జైల్లో ఉన్నానని.. తనకు జీవించే హక్కు కల్పిస్తూ బెయిల్ మంజూరు చేయాలంటూ చింటూ తన న్యాయవాది ద్వారా ఏడో సారి హైకోర్టును ఆశ్రయించాడు. అయితే చింటూకు బెయిల్ ఇస్తే జంట హత్య కేసులో సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, బెదిరింపులకు గురిచేసే అవకాశం కూడా లేకపోలేదంటూ ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించారు. పిటిషనర్ వాదనతో ఏకీభవించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి.. చింటూకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. రూ.లక్ష విలువైన బాండ్లను సమర్పించి, ఇద్దరు వ్యక్తులు ష్యూరిటీలను చిత్తూరు జిల్లా కోర్టు ఎదుట హాజరుపరచాలని పేర్కొన్నారు. చింటూ ఎట్టి పరిస్థితిల్లోనూ చిత్తూరు నగరంలోకి ప్రవేశించకూడదని, మాజీ మేయర్ దంపతుల హత్య కేసులో తుది తీర్పు వచ్చేంత వరకు ఈ షరతు వర్తిస్తుందన్నారు. జంట హత్య కేసు విచారణ సమయంలో మాత్రమే చింటూ చిత్తూరు కోర్టు ఎదుట హాజరు కావాలని తీర్పులో తెలిపారు. చింటూ ఫోన్ నంబర్, లొకేషన్లకు తిరుపతి, చిత్తూరు ఎస్పీలకు అందజేయాలన్నారు. కాగా కోర్టు ఆదేశాలతో చింటూ చిత్తూరులో ఉండకుండా, జంట హత్యల కేసు ముగిసేంత వరకు తిరుపతిలో నివసించే అవకాశం ఉంది. వచ్చేవారం చింటూ చిత్తూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యే అవకాశాలున్నాయి.

పెద్దిరెడ్డిని రాజకీయంగా అణచివేసేందుకు కుట్ర

- బరదజల్లేందుకు తప్పుడు కథనాలు
- ఎలాంటి మచ్చలేని నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పచ్చపత్రిక కథనాలపై భూమన ఆగ్రహం



భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్రంలో కీలకంగా వ్యవహరిస్తున్న మా నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా అణచివేయాలన్న కుట్రలు, కుతంత్రాలతో లేనిపోని తప్పుడు కథనాలను తన ఎల్లో మీడియాలో వండి వారుస్తున్న నీచులు చంద్రబాబు, లోకేష్ అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. పెద్దిరెడ్డిపై ఈనాడు పత్రిక రాస్తున్న తప్పుడు కథనాలను ఆయన ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఒక వీడియోను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ కీలకనేతలపై అక్రమ కేసులు పెట్టడం, దాడులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే వైఎస్సార్‌సీపీలో సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని చంద్రబాబు, లోకేష్ టార్గెట్ చేశారన్నారు. ఆయన్ను ఇబ్బందులకు గురిచేయాలన్న దురాలోచనతో అటవీ భూములు ఆక్రమించారంటూ ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు రాయించడం వారి దుర్మార్గానికి నిదర్శనమన్నారు. పెద్దిరెడ్డిపై బురదజల్లేందుకు 22.5 ఎకరాల అటవీ భూమి ఆక్రమించారని ఈనాడు పత్రికలో రాయడం వెనుక చంద్రబాబు, లోకేష్ ఉన్నారన్నారు. పెద్దిరెడ్డి ఎలాంటి భూ ఆక్రమణలకు పాల్పడలేదని అటు రెవెన్యూ, ఇటు అటవీశాఖ అధికారులు సర్వే చేసి చెప్పారన్నారు. అయినా సరే ఈనాడు దినపత్రిక శుక్రవారం మళ్లీ తమ పార్టీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీద అక్షరాల వాంతి చేసుకుందన్నారు. నిరంతరం ఆయన మీద పడి ఏడుస్తూ ఉండడం ఈనాడుకు అలవాటుగా మారిందని మండిపడ్డారు. మదనపల్లె ఆర్డీఓ కార్యాలయంలో పెద్దిరెడ్డి పీఏ తుకారాం, మాధవరెడ్డి దీనికి సంబంధించిన ఫైళ్లను ఆధారాలు లేకుండా చేశారని, దీనికి ఆర్డీఓ మురళి సహకరించారని గతంలోనూ ప్రచురించిందని, మళ్లీ ఇప్పుడు అదే అసత్య వార్తను ప్రచురించడంపై ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇందులో విచారణ నివేదిక సమర్పించారని చెబుతూనే అమెరికాలో ఉన్నటువంటి తుకారాంను పిలిపించలేదని, మదనపల్లెలో ఉన్న మాధవరెడ్డిని విచారణ చేయలేదని రాసిందన్నారు. అయితే అధికారంలో ఉండి ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. పచ్చి అబద్ధాలతో కూడిన వార్తలు రాయడంలో ఈనాడు పత్రిక దేశంలోనే ఉన్నతమైన స్థానంలో ఉందన్నారు. సాక్షాత్తు డిజీపీనే అక్కడకు పంపి విచారణ చేయమని చెప్పిన ఆ విచారణ ఏమైందన్న విషయాన్ని కూడా చంద్రబాబు బయట పెట్టలేదన్నారు. పెద్దిరెడ్డిపై బురదచల్లే కార్యక్రమం తప్ప నిజంగా అక్కడ ఏ అవినీతికి ఆస్కారం లేదన్నారు. మీరు ఎన్నిరకాల కుట్రలు చేసినా కడిగిన ముత్యం పెద్దిరెడ్డి అన్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు.

శ్రీవారి సేవలో ఏపీ చీఫ్ సెక్రటరీ



చీఫ్ సెక్రటరీకి లడ్డూ ప్రసాదాలు

తిరుమల: ఏపీ చీఫ్ సెక్రటరీ విజయానంద్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఛ్ఛీ..వదిలేశారు!

- ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల ఉదాసీనత
- రెవెన్యూ అధికారులు పట్టుకున్నా వదిలేస్తున్న పోలీసులు




పోలీసు స్టేషన్‌లో సీజ్ చేసిన ట్రాక్టర్లు


చంద్రగిరి: చంద్రగిరిలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పట్టించినా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో వాహనాలను వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఘటనే గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. రెడ్డివారిపల్లి, బ్రహ్మంగారి ఆలయం, నాగయ్యగారిపల్లి, కేశవరెడ్డి పాఠశాల వెనుక వైపున ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. గతంలో నిరసనలకు దిగిన నాగయ్యగారిపల్లి గ్రామస్తులు ముందుండి ఇసుక విక్రయిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తహసీల్దార్ శివరామసుబ్బయ్య ప్రత్యేక ర్యాపిడ్ యాక్షన్ టీంను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం రాత్రి బ్రహ్మంగారి ఆలయం వద్ద జేసీబీల ద్వారా ఇసుక తరలిస్తున్నారంటూ ఫిర్యాదు వెళ్లింది. ఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ బృందం సభ్యులు ఒక జేసీబీతో పాటు ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి వాటిని అప్పగించారు.

ఉన్నతాధికారి ఫోన్‌తో వదిలేశారు!

పట్టుబడిన జేసీబీను వదిలేయాలంటూ అధికార పార్టీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. చంద్రగిరికి చెందిన ఓ నేత తన పరపతిని ఉపయోగించి స్టేషన్‌లోని ఓ ఉన్నతాధికారికి ఫోన్ చేసి తమ జేసీబీని విడిచిపెట్టాలంటూ ఆదేశించాలని కోరినట్లుగా సమాచారం. దీంతో సిబ్బంది ఆ అధికారి ఆదేశాలను పాటించి జేసీబీని వదిలేశారు. తర్వాత పట్టుబడిన ఐదు ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. తాము అడ్డుకుంటున్నా పోలీసులే పరోక్షంగా వారికి సహకారం అందిస్తున్నారంటూ రెవెన్యూ అధికారులు సైతం ఆరోపణలు చేస్తున్నారు. వారం వారం వాటాలు అందడంతోనే ఇలా పోలీసులు వదిలేస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

దొరికింది శ్రీవారి పాదాలే!





నామాల కాలువలో దొరికిన పాదాలు, శ్రీవారి విగ్రహానికి జోడించిన పాదాలు


రామచంద్రాపురం: తిరుపతి సమీపంలోని రామచంద్రాపురం మండలం, నామాల కాలువలో ఈనెల 2వ తేదీ దొరికిన పాదాలు శ్రీవారి విగ్రహానివే అని నడవలూరు గ్రామస్తులు వెల్లడించారు. గత కొంత కాలం క్రితం ఆ గ్రామస్తులకు నల్ల రాతి విగ్రహంలోని శ్రీవారి ప్రతిమ (పాదాలకు పైభాగం) దొరకగా భద్రంగా దాచి పెట్టారు. తాజాగా దొరికిన పాదాలు ఆ విగ్రహానికి జోడించడంతో ఆ రెండు సమానంగా కలిశాయి. దీంతో గతంలో దొరికిన రాతి విగ్రహం, పాదాలు ఒకటిగా ఉండడంతో అవి శ్రీవారి పాదాలుగానే నిర్ధారణ చేశారు. రాయల చెరువు నిర్మాణానికి ముందు కార్వేటి నగరం రాజులతో పాటు తమిళనాడు నుంచి వెళ్లే శ్రీవారి భక్తులు గుండోడు కణం మీదుగా తిరుమలకు వెళ్లేవారని, ఆ భక్తులు నామాల కాలవలో పుణ్య స్నానాలు ఆచరించి నామాలు ధరించి ఆ తర్వాత తిరుమలకు వెళుతుంటారని, అందుకే ఆ కాలువను నాటి నుంచి నేటి వరకు నామాల కాలువగా పిలిచేవారన్నారు. హిందూ దేవాలయాలపై నవాబులు దాడులు చేసిన సమయంలో ఈ నామాల కాలవలో ఉన్న స్వామివారి విగ్రహంపై కూడా దాడిచేసి స్వామి వారి విగ్రహాన్ని ధ్వంసం చేసినట్టుగా గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. నామాల కాలువ గట్టుపైనే ఆలయాన్ని పునః నిర్మాణం చేస్తామని స్పష్టం చేస్తున్నారు. టీటీడీ అధికారులు స్పందించి నామాల కాలవను అధీనంలోకి తీసుకొని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఇది తప్పులేదా బాబూ?

తిరుపతి మంగళం : అలిపిరి వద్ద ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి చంద్రబాబు అనుమతులు ఎలా ఇస్తారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ప్రశ్నించారు. ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి చంద్రబాబు చొరవతో అన్ని అడ్డంకులు తొలగిపోయాయని ఓ దినపత్రిక రాసిందని ఆయన గుర్తుచేశారు. దీనిపై భూమన కరుణాకరరెడ్డి శుక్రవారం మీడియతో మాట్లాడారు. ఈ హోటల్ నిర్మాణానికి సంబంధించి 2021లోనే ప్రతిపాదనలు వచ్చాయని, అయితే దానిమీద ముంతాజ్ అన్న పేరు ఉండడంతో హిందూ సంఘాలన్నీ పెద్ద అలజడి చేయడంతో ఆ పనులు ఆగిపోయాయని తెలిపారు. అయితే ఇప్పుడు మళ్లీ ట్రైడెంట్ గ్రూప్ పేరుతో చంద్రబాబు చొరవ తీసుకుని అనుమతులివ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అప్పుడు ఆ హోటల్‌కు అనుమతులు ఇస్తే సంక్షోభం అన్నారు, ఇప్పుడు చంద్రబాబు ఇస్తే సంక్షేమమవుతుందా..? అని ప్రశ్నించారు. అలిపిరికి దూరంగా యాత్రికులకు విశ్రాంతి కల్పించేందుకు ట్రైడెంట్ గ్రూపు పేరుతో నిర్మిస్తున్న ఏడు నక్షత్రాల ఆతిథ్య మందిరంలో మద్యం బదులు తీర్థం పోస్తారా అని ఎద్దేవా చేశారు. జగన్ మంచినీళ్లు ఇచ్చినా అది పెద్ద తప్పు, అదే చంద్రబాబు మద్యం ఇచ్చినా చాలా ఒప్పు అన్నట్లుగా ఎల్లో మీడియా గొంతు చించుకుంటోందన్నారు.

డక్కిలిలో టీడీపీ నేతల దాష్టీకం

- వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి యత్నం
- భయాందోళనకు గురైన ఏపీడీ



ఉపాధి అక్రమాలపై ఏపీడీకి వివరిస్తున్న స్థానికులు

డక్కిలి: డక్కిలిలో ఉపాధి అక్రమాలు బయటపెట్టడంతో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి యత్నించారు. దీంతో విచారణ అధికారి ఏపీడీ భయాందోళనకు గురైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. డక్కిలిలో ఉపాధి అక్రమాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బోగస్ మస్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, బయట ప్రాంతాల్లో ఉన్న వారు, హైస్కూల్‌లో పనిచేస్తున్న వాచ్‌మన్లను ఉపాధి కూలీలుగా చూపించి బిల్లులు పెట్టిన వైనాన్ని ఎండగట్టారు. ఈ మేరకు శుక్రవారం డక్కిలి సచివాయలంలో ఏపీడీ వరప్రసాద్ బహిరంగ విచారణ చేపట్టారు. విచారణలో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. తమ తప్పులు ఎక్కడ బయటపడుతాయోనని ఫిర్యాదుదారులైన వైఎస్సార్‌సీపీ నాయకులు మాదిరెడ్డి మునిరామ్‌రెడ్డి, డక్కిలి మురళీరెడ్డి, మునిరెడ్డి, రవీంద్రారెడ్డిపై దాడికి యత్నించారు. టీడీపీ నాయకులైన డక్కిలి సునీల్ రెడ్డి, దందోలు పెంచలరెడ్డి, పోట్లేళ్ల శ్రీనివాసులు, పిల్లి శ్రీనివాసులురెడ్డి తీరుతో విచారణ అధికారి సైతం భయాందోళనకు గురయ్యారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు నమోదు చేసేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఇరు వర్గాలను సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. అనంతరం ఏపీడీ సమగ్ర నివేదికను తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులు అందజేశారు.

ఎర్రచందనం కేసులో నలుగురికి జైలు

తిరుపతి లీగల్ : ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో నలుగురికి ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2011 ఆగస్టు 13న రుద్రవరం ఫారెస్ట్ అధికారులు తెలుగు గంగ కాలువ, పెద్ద వంగిలి బీట్, చిన్న బండ్లశాల అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కర్నూలు జిల్లా, రుద్రవరం మండలం, ఆలమూరుకు చెందిన జీ.వెంకటరమణ, పీ.నరసింహులు, ఏ.మద్దిలేటి, షేక్ హుస్సేన్, పీ.ప్రసాద్ తొమ్మిది ఎర్రచందనం దుంగలను నరికి నాలుగు దుంగలను భుజాలపై తరలిస్తుండగా ఫారెస్ట్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసి ఆళ్లగడ్డ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. నేరం ఐదుగురిపై రుజువు కావడంతో న్యాయమూర్తి ఐదుగురికీ శిక్ష విధిస్తూ 2020 ఫిబ్రవరి 13న తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై ఐదుగురు రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నారు. కేసు విచారణ దశలో ఐదో నిందితుడిగా ఉన్న పీ.ప్రసాద్ మృతి చెందాడు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి కింది కోర్టు విధించిన శిక్షను ఖరారు చేస్తూ నలుగురికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కోటేశ్వర్‌రెడ్డి వాదించారు.

క్లుప్తంగా

కోళ్ల మరణాలపై ఆందోళన వద్దు

కోట: కోళ్ల మరణాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశుసంవర్ధకశాఖ ఏడీ సుబ్రమణ్యం తెలిపారు. కొన్ని జిల్లాల్లో కోళ్లు ఎక్కువగా మృతిచెందుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో విద్యానగర్‌లో మరణించిన కోళ్లను ఒక ఆటోలో తీసుకువెళుతున్నట్టు శుక్రవారం పుకార్లు వ్యాపించాయి. ఈ నేపథ్యంలో ఏడీ తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కోట, చిల్లకూరు, వాకాడు మండలాల్లో ఎక్కడా ఫౌల్ట్రీ ఫారాలు లేవన్నారు. బయట ప్రాంతాల నుంచి కోళ్లను తీసుకువచ్చే వ్యాపారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా కోళ్లు మరణించినట్లు తెలిస్తే వెంటనే పశువైద్యశాలకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు మాంసం, గుడ్లు వంటి వాటిని బాగా ఉడికించిన తర్వాతే తినాలని పేర్కొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఓజిలి/వెంకటగిరి రూరల్/బాలాయపల్లి (సైదాపురం): బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు ఓజిలి, బాలాయపల్లి ఎంపీడీవోలు విజయలక్ష్మి, వినీల్ కుమార్, వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసక్తి వున్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

వెంకటగిరి రూరల్/సూళ్లూరుపేట : వెంకటగిరి పట్టణం పాలకేంద్రం, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం సమీపంలో వున్న 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, మన్నారుపోలూరులోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈఈలు మునిరవిచంద్ర, శేఖర్ తెలిపారు. వెంకటగిరి టౌన్, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాలు, సూళ్లూరుపేట, మన్నారుపోలూరు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాల వద్ద తల్లిదండ్రుల నిరసన



కలువాయి: పాఠశాలల విలీనంపై కలువాయి మండలంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. కలువాయి ఉర్దూ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు శుక్రవారం నిరసన తెలిపారు. పాఠశాలను విలీనం చేయడం వల్ల పిల్లలు ఇబ్బందులు పడతారని తెలిపారు. తమ పిల్లలను ఒకటిన్నర కిలోమీటర్ దూరంలోని మోడల్ పాఠశాలకు పంపించేది లేదని పేర్కొన్నారు. పాఠశాలను ఇక్కడే కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మేకల దొంగలు అరెస్టు

కలువాయి: కలువాయిలో మేకలను అపహరించిన దొంగలను యజమాని శుక్రవారం పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. కలువాయి గిరిజన కాలనీకి చెందిన సుధయ్య 6 మేకలను మాదన్నగారిపల్లికి చెందిన కృష్ణయ్య, చందు అపహరించారు. అనంతరం వాటిని ఆటోలో గూడూరు సంతకు తరలించి విక్రయించేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న సుధయ్య అక్కడికి వెళ్లి మేకలు తరలించిన ఆటోను, దొంగలను పట్టుకున్నాడు. కలువాయి పోలీసులకు అప్పగించాడు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

అభివృద్ధి పనులకు ప్రత్యేక ప్రణాళికలు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన సీసీరోడ్డు పనులను నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగు నీటి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ రాజేంద్ర, ఎంఈవో మునిరత్నం, ఏవో గణేష్, హెచ్‌వో శారద పాల్గొన్నారు.

గజవాహనంపై నృసింహుడి చిద్విలాసం

రాపూరు: మండలంలో పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అనుబంధ గోనుపల్లిలో వెలసిన గొల్లబోయస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. స్వామి వారి జన్మ నక్షత్రం మాఘ శుద్ధ పంచమిని పురస్కరించుకుని శుక్రవారం స్వామికి అభిషేకం చేశారు. పూలంగి సేవ, గోపూజ, హోమం నిర్వహించారు, సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిని గజ వాహనం, తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు శశిస్వామి పాల్గొన్నారు.

లైట్ హౌస్ అభివృద్ధి కలేనా..?

జాలర్లు చేపల వేట కోసం సముద్రంలోకి వెళుతుంటారు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఓడల ద్వారా ప్రయాణం చేస్తూ ఉంటారు. సరుకుల రవాణా కూడా కొనసాగుతూ ఉంటుంది. ఈ క్రమంలో వారికి సముద్రంలో దారి చూపేందుకు తీర ప్రాంతంలో ఎత్తైన కట్టడం నిర్మించి దానిపై దీపం ఏర్పాటుచేస్తారు. దాని వెలుగును బట్టి నావికులు తీరానికి చేరుకుంటారు. ఈ క్రమంలోనే వాకాడు మండలం ఓడపాళెం వద్ద బ్రిటీషు వారి హయాంలో లైట్ హౌస్ నిర్మించారు. కెరటాలు.. సముద్రంపై నుంచి వచ్చే హోరు గాలి.. పచ్చని సవక తోటలు ప్రజల మనసును దోచుకుంటున్నాయి. దీన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికులు 20 ఏళ్లుగా కోరుతున్నారు. వారి కల కలగానే మిగిలిపోతోంది.

- పర్యాటక ప్రాంతంగా దక్కని గుర్తింపు
- నిరుపయోగంగా ఉన్న పాత లైట్ హౌస్
- రూ.250 కోట్లతో ప్రతిపాదనలు పంపిన గత ప్రభుత్వం
- ఎన్నికల కోడ్‌తో ఆగిపోయిన పనులు
- పట్టించుకోని ప్రస్తుత కూటమి ప్రభుత్వం



సముద్ర తీరంలో సందడి చేస్తున్న పిల్లలు, మహిళలు (ఇన్‌సెట్) లైట్ సముద్ర తీరంలోనున్న చవక తోటలు



పురాతన లైట్‌హౌస్

వాకాడు : సముద్ర తీరప్రాంతమైన ఓడపాళెం వద్ద 120 మీటర్ల ఎత్తులో లైట్ హౌస్ ఏర్పాటుచేశారు. దానిపైన 24 లైట్లు అమర్చారు. అవి నిమిషానికి ఒక సారి నాలుగు వైపులా తిరుగుతాయి. దీని కాంతి 44 మైళ్ల దూరం వరకు పడుతుంది. అలాగే సమీపంలోని సముద్రంలో ఎగసి పడే కెరటాలు, పచ్చని సవకతోటలు, సహజ సిద్ధంగా ఏర్పడిన పురాతన ఓడరేవు పర్యాటకుల మనసు దోచుకుంటున్నాయి. ఇక్కడికి తిరుపతి జిల్లా నుంచే కాకుండా నెల్లూరు, చిత్తూరు, కడప తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పర్యాటకులు వస్తుంటారు. పర్వదినాలు, సెలవు దినాల్లోనే కాకుండా వారం పొడవునా పర్యాటకుల సందడి ఉంటుంది. పచ్చని సవకతోటలు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య భోజనం చేస్తూ సేద తీరుతారు. ఆనందంగా గడుపుతారు. వారికి కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది.

నిరుపయోగంగా ఉన్న పాత లైట్ హౌస్

వ్యాపారం కోసం భారతదేశానికి వచ్చిన బ్రిటీషు వారు 1750లో తమ వ్యాపారాలను వృద్ధి చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఓడపాళం వద్దవున్న సహజ సిద్ధమైన ఓడరేవును ఆసరాగా తీసుకుని సముద్రయానం చేసేందుకు అనుకూలంగా 1755లో లైట్ హౌస్‌ను నిర్మించారు. దాని పైగాన నూనె దీపాలు అమర్చి ఓడరేవుగా ఉపయోగించారు. అప్పట్లో ఆర్ముగం అనే వ్యక్తి ఈ ప్రాంతంలో లైట్ హౌస్ నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. దీంతో దానికి ఆర్ముగన్ లైట్ హౌస్ అని పేరు పెట్టారు. ఈ లైట్ హౌస్ 1916 నుంచి నిరుపయోగంగా మారింది. 1947లో బ్రిటీషు వారు భారతదేశాన్ని వదిలి వెళ్లిపోవడంతో సహజ సిద్ధమైన ఓడరేవు కూడా మరుగున పడిపోయింది. స్థానిక మత్స్యకారులు మాత్రం దాన్ని చేపల రేవుగా ఉపయోగిస్తున్నారు. 1972లో గూడూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి లైట్ హౌస్ కు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రయత్నించారు. 1974లో అప్పటి రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి దామోదరం సంజీవయ్యను ఈ ప్రాంతానికి తీసుకువచ్చి లైట్ హౌస్ ప్రాధాన్యతను వివరించారు. చివరికి కేంద్ర నౌకా నిర్మాణ మంత్రిత్వ శాఖ అనుమతితో 1977లో కొత్త లైట్ హౌస్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. 1983 నాటికి నిర్మాణం పూర్తి చేశారు. మద్రాసు లైట్ షిప్స్ అండ్ డైరెక్టర్ ఈకే రావు దాన్ని ప్రారంభించారు. ఆంగ్లేయుల కాలంలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ సహజ సిద్ధమైన ఓడరేవు ఘనమైన వైభవాన్ని కోల్పోయి ఉనికిని మాత్రమే కాపాడుకుంది. దీన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని, ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందని, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కనిపించని వసతులు

లైట్‌హౌస్ ప్రాంతంలో తాగేందుకు నీరు దొరకడం లేదు. పర్యాటకులు బస చేయాలంటే కాటేజీలు, భోజన వసతి, స్నానాల గదులు లేవు. ఇక్కడికి వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాన్ని చేపల రేవుగా, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న ప్రజాప్రతినిధుల ప్రయత్నాలు రెండు దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమయ్యాయి.

ఎంపీ చొరవతో నిధుల మంజూరు



కొత్త లైట్‌హౌస్

ఓడపాళెం లైట్ హౌస్‌తోపాటు మొనపాళెం, పూడిరాయి దొరువు, నవాబుపేట, మరో మూడు గ్రామాలను కలుపుతూ పర్యాటకంగా అభివృద్ధి తిరుపతి ఎంపీ గురుమూర్తి పార్లమెంటు సమావేశాల్లో కోరారు. రూ.248 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో సముద్ర ముఖద్వారాల ఏర్పాటుకు రూ.97.09 కోట్లు, టూరిజం, ఫిషింగ్ ల్యాండ్స్ ఏర్పాటుకు రూ.23 కోట్లు, తూపిలిపాళెం మత్స్యకార గ్రామ అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరైంది. ఈ పనులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనుల గురించి పట్టించుకోలేదు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



లైట్ హౌస్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని 20 ఏళ్లుగా చెబుతున్నారు. ఆచరణలో పెట్టడం లేదు. గత ప్రభుత్వం సముద్ర తీర ప్రాంతంలోని 7 మత్స్యకార గ్రామాలను కలుపుకుని టూరిజం పాయింటుగా అభివృద్ధి చేయాలని రూ.250 కోట్లతో ప్రతిపాదనలు పంపించింది. నిధులు కూడా మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ రావడంతో పనులు మొదలుకాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పనులు చేపట్టలేదు. – మునస్వామి, ఓడపాళెం

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



గతంలో మంజూరైన అభివృద్ధి పనులను ఇటీవల మానిటరింగ్ బోర్డు అధికారులు పరిశీలించారు. కొలతలు తీసుకుని వెళ్లారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అనుకుంటున్నాం. వారం రోజుల్లో జిల్లా కలెక్టర్ పర్యటన ఉంది. అప్పుడు పూర్తి వివరాలు వెల్లడిస్తాను.

– నాగరాజు, మత్స్యశాఖ జేడీ తిరుపతి జిల్లా

ఎంపీ నిధులతో పల్లెల్లో అభివృద్ధి పనులు



రాచపాళెంలో నిర్మించిన సీసీరోడ్డు



పెదపరియ రైల్వేస్టేషన్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బస్ షెల్టర్

ఓజిలి: మండలంలోని పెదపరియ ఎస్సీ కాలనీ, రాచపాళెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు తిరుపతి ఎంపీ గురుమూర్తి తన నిధులు మంజూరు చేసినట్టు నాయకులు కొండూరు దామోదర్‌రాజు, గోవిందు, పోలయ్య, శ్రీనివాసులు శెట్టి తెలిపారు. వారు ఇటీవల ఎంపీని కలిసి రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. స్పందించిన ఎంపీ సీసీ రోడ్లుకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. వాటితో రెండు గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తి చేశారు. అలాగే పెదపరియ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.5 లక్షలతో బస్ షెల్టర్ నిర్మిస్తున్నారు. తమ సమస్యలు తెలుసుకుని పరిష్కరించిన ఎంపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

చిల్లకూరు : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు ఆకాంక్షించారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లిలో శుక్రవారం ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు గోరు ముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో పిల్లలు నీరసించిపోయే ప్రమాదం ఉందని గుర్తించి ఏడేళ్ల క్రితం గోరుముద్ద కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి ఏటా 400 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని వివరించారు. హెచ్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ డొక్కా సీతమ్మ 150 ఏళ్ల క్రితం బాటసారులకు భోజనం పెట్టారని, ఆమె పేరు ఇప్పటికీ నిలిచిపోయిందన్నారు. ఇదే విధంగా రాజనేని ట్రస్టు కూడా గుర్తింపు పొందుతుందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎంఈవో హమీద్, ట్రస్టు ప్రతినిధులు రాజనేని రామానాయుడు, బాబు, ప్రజేంద్ర రెడ్డి, వెంకటక్రిష్టారెడ్డి, చింతవరం, తిక్కవరం హెచ్‌ఎంలు శివసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మునిభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

సూళ్లూరుపేట/వాకాడు : సూళ్లూరుపేట, వాకాడు పట్టణాలను శుక్రవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. ఎదురుగా ఉండే మనిషి సైతం కనిపించనంతగా దట్టంగా మంచు కురిసింది. వాహనాలు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. రోడ్డు సరిగా కనిపించకపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.



వాకాడు: హెడ్ లైట్లు వేసుకుని వెళుతున్న వాహనాలు



వాకాడు: పొగ మంచుతో నిలిచిన వాహనాలు



సూళ్లూరుపేట పట్టణాన్ని కమ్మేసిన పొగమంచు

గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం

చిల్లకూరు : తీర ప్రాంతంలోని మత్స్యకార గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు అదానీ క్రిష్ణపట్నం పోర్టు ప్రొఫెషనల్ శానిటేషన మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ సాయినాథ్ తెలిపారు. తమ్మినపట్నం పంచాయతీ కొత్తూరు, గమ్మళ్లదిబ్బ గ్రామాల మహిళలు, గ్రామ పెద్దలకు శుక్రవారం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్తతో ఎరువు తయారు చేసేందుకు అదానీ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా మహిళలతో కమిటీలు ఏర్పాటు చేసి పారిశుద్ధ్యంపై అవగాహనతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సర్పంచ్ సుబ్రహ్మణ్యం, అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు అరుణ్, డాక్టర్ రమేష్‌బాబు, పార్మర్ ప్రొడ్యూసర్ సీఈవో వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవారెడ్డికి ఎమ్మెల్సీ పరామర్శ



సుబ్బరాఘవరెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిట్టమూరు : మండలంలోని ఆరూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత దేవారెడ్డి సుధాకర్ రెడ్డిని శుక్రవారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. సుధాకర్ రెడ్డి తండ్రి దేవారెడ్డి సుబ్బరాఘవరెడ్డి శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆరూరు గ్రామానికి చేరుకుని సుబ్బరాఘవరెడ్డి భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బీవీ రమణయ్య, నేతలు దేవారెడ్డి రోశిరెడ్డి, పేట రాజీవ్‌రామిరెడ్డి, కామిరెడ్డి రమేష్ రెడ్డి, పెళ్లూరు సురేంద్రరెడ్డి, పాటిమిట్ట రాధారెడ్డి, సుదర్శన్ రెడ్డి, మాచిరెడ్డి సుధీర్ రెడ్డి, లోకేష్ రెడ్డి, అనీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట/సూళ్లూరుపేట రూరల్ : పెండింగులో వున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం తొమ్మిది మండలాల రెవెన్యూ అధికారులు, డీఎస్పీలతో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సూళ్లూరుపేట, శ్రీసిటీ, పుత్తూరు తదితర ప్రాంతాలకు సంబంధించి 26 కేసులు పెండింగులో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో నాయుడుపేట, పుత్తూరు, శ్రీసిటీ డీఎస్పీలు చెంచుబాబు, రవికుమార్, పైడేశ్వరరావు, నాయుడుపేట, సూళ్లూరుపేట సీఐలు సంగమేశ్వరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

తడ: మండలంలోని కొండూరు పంచాయతీ పులివేంద్ర గ్రామం వద్ద ఈ నెల 4న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చెన్నైలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడు గ్రామానికి చెందిన రావినూతల శీనయ్య(60) చెన్నై కార్పొరేషన్‌లో పనిచేస్తూ అంబత్తూరులో ఉంటున్నారు. ఆయన ఈ నెల 4న బైక్‌లో గుడిపల్లిపాడుకు వెళుతూ పులివేంద్ర గ్రామం వద్ద అదుపు తప్పి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు 108లో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చెన్నైకి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. శీనయ్య భార్య దొరసానమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కొండపనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం



రాపూరు: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

రాపూరు/ఓజిలి/చిట్టమూరు : పిల్లల్లో నులి పురుగులను నిర్మూలిద్దామని రాపూరు మండలం వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు ప్రమీల రాజకుమారి, ఓజిలి, చిట్టమూరు ఎంపీడీవోలు విజయలక్ష్మి, మనోహర్‌గౌడ్ పిలుపునిచ్చారు. వారు శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 10న పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. పిల్లల కడుపులో నులి పురుగులు ఉంటే ఎదుగుదల తక్కువగా ఉంటుందని వివరించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు



బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తొలగిస్తున్న డీఎస్పీ, సీఐలు, పోలీసులు

చిల్లకూరు : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని గూడూరు డీఎస్పీ గీతాకుమారి హెచ్చరించారు. గూడూరు రెండవ పట్టణంలో శుక్రవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారికి అవగాహన కల్పించారు. అలాగే చెత్తను, ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. ఆమె మాట్లాడుతూ కొంత మంది రోడ్డు పక్కన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారని తెలిపారు. దాన్ని నివారించేందుకు మద్యం సేవించే వారితోనే పరిసరాలను శుభ్రం చేయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఒకటి, రెండవ పట్టణ సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాసులు, మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

వెంకటగిరి రూరల్/గూడూరు రూరల్ : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి ఓ అనూష, గూడూరు ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా భేగం తెలిపారు. వెంకటగిరి, గూడూరు ఆర్టీసీ డిపోల వద్ద శుక్రవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు విధి నిర్వహణలో ఏకాగ్రతతో పనిచేయాలన్నారు. బస్సులు నడిపే సమయంలో ఒత్తిళ్లకు లోనుకాకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గూడూరు సబ్ జడ్జి రాజేష్, వెంకటగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ, న్యాయవాదులు ఎల్ కోటేశ్వరరావు, సుంకర రాజేష్ పాల్గొన్నారు.

బేబీ కిట్ల పంపిణీ

గూడూరు రూరల్ : గూడూరు ఏరియా ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలోవున్న పురిటి బిడ్డలకు అవసరమైన బేబీ కిట్లను శుక్రవారం డిప్లొమా ఇంజినీర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ రియాజ్ అహ్మద్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా తన పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సారి చిన్న పిల్లలకు బేబీ కిట్లు అందజేసినట్టు తెలిపారు. డాక్టర్ చంద్రహాస్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రామ్మోహన్, శ్రీనయ్య, దయాల్, రమణయ్య, శ్రీనివాసులురెడ్డి, కళ్యాణసాయి పాల్గొన్నారు.

కండలేరులో 54.060 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 54.060 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఆందోళన విరమించిన మున్సిపల్ కార్మికులు



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

నాయుడుపేట టౌన్ : మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎస్‌కే ఫజులుల్లాతో చేపట్టిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన విరమించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు రెండు నెలల్లో చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే సహజ మరణం చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.2 వేలు, సంక్రాంతి బోనస్ రూ.1000 కూడా అందజేస్తామని తెలిపారని వెల్లడించారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కార్మికులపై వేధింపులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రమణ్యంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధు, హరి, శ్యామలమ్మ, మహాలక్ష్మమ్మ, మస్తానయ్య, రమణయ్య పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న కార్యదర్శి శ్రీలక్ష్మి, ప్రసూనమ్మ

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు పంచాయతీ మొండికట్టు రాజుపాళెం గిరిజన కాలనీలో శుక్రవారం తాగునీటి బోరు వేశారు. కాలనీలో 20 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్టు ఎంపీడీవో విజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ క్రమంలో పంచాయతీ నిధులు రూ.1.30 లక్షలతో బోరు వేయాలని ఎంపీడీవో అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఉప సర్పంచ్ గుంటమడుగు సుకుమార్‌రాజు బోరు వేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, రుద్రరాజు ప్రసూనమ్మ పాల్గొన్నారు.

జెట్టీల నిర్మాణానికి స్థల పరిశీలన

చిల్లకూరు : తీర ప్రాంతంలో మత్స్యకారులు బోట్లు నిలుపుకునేందుకు వీలుగా జెట్టీల నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం శుక్రవారం గమ్మళ్లదిబ్బ వద్ద మెరైన్ పోలీసులు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మెరైన్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం జెట్టీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు పరిశీలించినట్టు చెప్పారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గుమ్మళ్లదిబ్బ వద్ద కండలేరు క్రీక్ ప్రాంతంలో ఇప్పటికే మత్స్యకారులు బోట్లను నిలుపుతున్నారని, అక్కడ జెట్టీల నిర్మాణాలు చేపడితే అందరికి అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ మల్లికార్జున్, మెరైన్ ఎస్‌ఐ అంజిరెడ్డి, వీఆర్వో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.